569) నీలాంబరి

ప॥ ఉన్నవేమి గుఱిగావు వొద్దనుండి నీవునాతో । అన్నమాటలే గుఱుతు అప్పటికప్పటికి ॥

చ॥ చూపులకు గుఱుతు నీసోయగమైన మేను । తీపులకు గురి నీ తేనెమోవి ।
కోపములకు గుఱి నీగోరి మదన రేకలే । చేపట్లకు గుఱి నీ చెట్టాపట్టాలే ॥

చ॥ చిత్తమునకు గుఱుతు సేసేటి నీచేతలే । హత్తి నాయాసకు గురి అంటుగాగిలి ।
మొత్తపు నవ్వుకు గురి ముంచిన నీసుద్దులే । గుత్తపు వలపులకు గురి నీమోహములు ॥

చ॥ పంతముల కెల్లా గురి పరచిన పానుపే । సంతసములకు గురి సరసములే ।
ఇంతలో శ్రీవేంకటేశ ఇట్టె నన్ను గూడితివి । మంతనాల కెల్లా గురి మతి పరవశమే ॥